గుజరాత్‌దే గెలుపు

బోణీ కొట్టిన టైటాన్స్ ● రాణించిన సాయి సుదర్శన్, ప్రసిద్ధ్ కృష్ణ

ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ అదిరిపోయే బోణీ కొట్టింది. తమ తొలి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై పోరాడిన గుజరాత్...మలి పోరులో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను మట్టికరిపించింది. సొంతగడ్డపై సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ ఈసీజన్‌లో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సాయి సుదర్శన్ సాధికారిక అర్ధసెంచరీతో పోరాడే స్కోరు అందుకున్న టైటాన్స్.. నిలకడైన బౌలింగ్‌తో ముంబైని కట్టడి చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ విజృంభణతో గుజరాత్ భారీ విజయాన్ని అందుకుంది.

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ జూలు విదిల్చింది. శనివారం సొంతగడ్డపై ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ 36 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 196/8 స్కోరు చేసింది. ఓపెనర్ సాయి సుదర్శన్(41 బంతుల్లో 63, 4ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు బట్లర్(39), కెప్టెన్ గిల్(38) రాణించారు. ముఖ్యంగా గత సీజన్ ఫామ్‌ను తిరిగి కొనసాగిస్తూ సుదర్శన్ అహ్మదాబాద్‌లో గత ఆరు ఇన్నింగ్స్‌లో ఐదు అర్ధసెంచరీలు సాధించాడు. హార్దిక్‌పాండ్యా(2/29) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ముంబై 160/6 స్కోరు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ(2/18), సిరాజ్(2/34) ముంబై పతనంలో కీలకమయ్యారు. పిచ్ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ అటు పేసర్లతో పాటు స్పిన్నర్లు రాణించడంతో గుజరాత్ విజయం నల్లేరు నడక అయ్యింది. ప్రసిద్ధ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సుదర్శన్ సూపర్:

మొదట టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా..గుజరాత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఓపెనర్లు సుదర్శన్, గిల్..గుజరాత్‌కు మెరుగైన శుభారంభం అందజేశారు. గిల్ బౌండరీల ఖాతా తెరువగా, సుదర్శన్..బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ 3వ ఓవర్‌లో రెండు ఫోర్లతో టచ్‌లోకి వచ్చాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన ముజీబ్ ఐదో ఓవర్‌లో సుదర్శన్ ఓ ఫోర్, సిక్స్‌తో చెలరేగితే..గిల్ ఫోర్ అరుసుకోవడంతో 15 పరుగులు వచ్చి చేరాయి. అదే దూకుడు కొనసాగిస్తూ చాహర్ బౌలింగ్‌లో గిల్ సిక్స్, ఫోర్ కొట్టడంతో పవర్‌ప్లే ముగిసే సరికి ముంబై వికెట్ కోల్పోకుండా 66 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో పవర్‌ప్లేలో ఒక జట్టు వికెట్ కోల్పోకపోవడం ఇది తొలిసారి. పవర్‌ప్లే తర్వాత ఇన్నింగ్స్ మందగించగా, హార్దిక్ 9వ ఓవర్‌లో నమన్ క్యాచ్ ద్వారా గిల్ ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత బట్లర్ వచ్చి రావడంతోనే సిక్స్, ఫోర్‌తో విరుచుకుపడ్డాడు. సుదర్శన్, బట్లర్‌ర వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో బట్లర్‌ను ఔట్ చేయడం ద్వారా గుజరాత్‌కు ముజీబ్ బ్రేక్‌లు వేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..సుదర్శన్ సమయోచితంగా వ్యవహరిస్తూ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. 50 పరుగుల తేడాతో చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. షారుఖ్(9), సుదర్శన్, తెవాటియా(0), రూథర్‌ఫర్డ్(18), రషీద్‌ఖాన్(6), సాయికిషోర్(1) వెంటవెంటనే ఔటయ్యారు.

ముంబై ఢీలా:

లక్ష్యఛేదనలో ముంబైకి ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. సిరాజ్ తొలి ఓవర్‌లో ఓపెనర్ రోహిత్‌శర్మ(8) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. స్వింగ్‌ను సరిగ్గా అర్థం చేసుకోని రోహిత్ తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. రికల్టన్(6) కూడా సిరాజ్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. దీంతో 35 పరుగులకే ముంబై ఓపెనర్లను కోల్పోయింది. ఈ దశలో తిలక్‌వర్మ(39), సూర్యకుమార్(48) ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. ప్రసిద్ధ్ బౌలింగ్‌లో తిలక్, సూర్య వెనుదిరిగారు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రాబిన్ మింజ్(3) ఘోరంగా నిరాశపరిచాడు ఆఖర్లో కెప్టెన్ పాండ్యా(11), నమన్ ధీర్(18 నాటౌట్), సాంట్నర్(18 నాటౌట్) పోరాడినా లాభం లేకపోయింది. గుజరాత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సాధించాల్సిన రన్‌రేట్ అంతకంతకూ పెరగడంతో ముంబై ఓటమి ఎదుర్కొవాల్సి వచ్చింది.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
బెంగళూరు	2	2	0	4	2.26
లక్నో	2	1	1	2	0.96
గుజరాత్	2	1	1	2	0.62
పంజాబ్	1	1	0	2	0.55
ఢిల్లీ	1	1	0	2	0.37
హైదరాబాద్	2	1	1	2	-0.12
కోల్‌కతా	2	1	1	2	-0.30
చెన్నై	2	1	1	2	-1.01
ముంబై	2	0	2	0	-1.16
రాజస్థాన్	2	0	2	0	-1.88

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 196/8(సుదర్శన్ 63, బట్లర్ 39, హార్దిక్ 2/29, రెహమాన్ 1/28),

ముంబై: 20 ఓవర్లలో 160/6(సూర్యకుమార్ 48, తిలక్ 39, ప్రసిద్ధ్ 2/18, సిరాజ్ 2/34)

జాతీయ స్థాయి కరాటే విజేత బాలాజీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన 4వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పారా ప్లేయర్ ముడావత్ బాలాజీ పసిడి పతకంతో మెరువగా, సాయి ప్రభాత్ రజతం సొంతం చేసుకున్నాడు. బాలుర అండర్-21 -67కేజీల కుమిటి విభాగంలో జనిత్ కాంస్య ఖాతాలో వేసుకున్నాడు. పోటీలకు ఆఖరి రోజైన శనివారం ముగింపు కార్యక్రమానికి జాతీయ కరాటే అసోసియేషన్(కేఐవో) ఉపాధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. 2027 ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. వేర్వేరు విభాగాల్లో ఢిల్లీ, మధ్యప్రదేశ్, హర్యానా ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి.

కివీస్‌దే తొలి వన్డే

నేపియర్(న్యూజిలాండ్): ఇప్పటికే టీ20 సిరీస్ కోల్పోయిన పాక్.. మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేయలేకపోయింది. శనివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 73 పరుగుల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. తొలుత కివీస్..మార్క్‌చాప్‌మన్(132) సెంచరీకి తోడు మిచెల్(76), అబ్బాస్(52) అర్ధసెంచరీలతో నిర్ణీత 50 ఓవర్లలో 344/9 స్కోరు చేసింది. ఇర్ఫాన్‌ఖాన్(3/51), రవూఫ్(2/38), జావెద్(2/55) ఆకట్టుకున్నారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన పాక్ 44.1 ఓవర్లలో 271 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్(78), సల్మాన్ ఆగా(58) అర్ధసెంచరీలతో రాణించారు. నాథన్ స్మిత్(4/60) నాలుగు వికెట్లు పడగొట్టాడు.

29 ఏండ్ల తర్వాత..

షెఫీల్డ్ షీల్డ్ గెలిచిన సౌత్ ఆస్ట్రేలియా

అడిలైడ్: సౌత్ ఆస్ట్రేలియా టీమ్ తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకుంది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఊరిస్తూ వస్తున్న ప్రతిష్ఠాత్మక షెఫీల్డ్ షీల్డ్ టోర్నీని సౌత్ ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. క్వీన్స్‌ల్యాండ్‌తో జరిగిన ఫైనల్లో 4 వికెట్ల తేడాతో సౌత్ ఆస్ట్రేలియా చిరస్మరణీయ విజయం సాధించింది. 270 పరుగుల లక్ష్యఛేదనలో సౌత్ ఆస్ట్రేలియా..జాసన్ సంగా(126 నాటౌట్) అజేయ సెంచరీకి తోడు అలెక్స్ క్యారీ(105) శతకంతో విజృంభించాడు. వీరిద్దరు 202 పరుగుల భాగస్వామ్యంతో జట్టు విజయంలో కీలకమయ్యారు.

భారత రెజ్లర్లకు నిరాశ

అమ్మాన్(జోర్డాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. శనివారం జరిగిన పురుషుల 65కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుజిత్ కల్కాల్..పాలస్తీనా రెజ్లర్ అబ్దుల్లా అసఫ్‌పై గెలిచినా..కైజీ తనాబే(జపాన్) చేతిలో ఎదుర్కొవాల్సి వచ్చింది. తనాబే ఫైనల్ చేరినా గాయం కారణంగా సుజిత్ రెపిచేజ్‌లో ఆడే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మిగతా విభాగాల్లో విశాల్ కాళీరామన్(65కి), చిరాగ్(57కి), చంద్రమోహన్(79కి) ప్రత్యర్థుల చేతుల్లో ఓటములు ఎదుర్కొన్నారు.

మెరిసిన కావేరి జ్యోతి

ఏషియన్ పారాలింపిక్ ట్రోబాల్ టోర్నీ

భూపాలపల్లి రూరల్, మార్చి 29: కాంబోడియా వేదికగా జరిగిన ఏషియన్ పారాలింపిక్ ట్రోబాల్ టోర్నీలో తెలంగాణకు చెందిన కావేరి జ్యోతి మెరిసింది. ఈ టోర్నీలో ఆతిథ్య కాంబోడియాకు స్వర్ణం, థాయ్‌లాండ్‌కు రజతం దక్కగా, భారత్ కాంస్యం ఖాతాలో వేసుకుంది. భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రానికి చెందిన నిరుపేద దళిత దివ్యాంగురాలు జ్యోతి భారత్ తరపున బరిలోకి దిగి అద్భుత ప్రదర్శన కనబరిచింది. టోర్నీలో పోటీపడి దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన జ్యోతిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో జ్యోతి మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. టోర్నీకి ముందు జ్యోతి దీనస్థితి గురించి తెలుసుకున్న మంత్రి శ్రీధర్‌బాబు..కాంబోడియా వెళ్లేందుకు అయ్యే ప్రయాణ, వసతి, శిక్షణ ఖర్చులను ప్రభుత్వం ద్వారా సమకూర్చారు. దేశం గర్వపడేలా రాణించిన జ్యోతి ప్రదర్శన పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టీ9 గోల్ఫ్ చాంప్ బంకర్ బస్టర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి బౌల్డర్‌హిల్స్ వేదికగా జరిగిన అరో రియాల్టీ టీ9 గోల్ఫ్ చాంపియన్‌షిప్‌లో బంకర్ బస్టర్స్ విజేతగా నిలిచింది. శనివారం ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన టైటిల్ పోరులో బంకర్ బస్టర్స్ సడెన్ డెత్‌లో టూటోరూట్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత జరిగిన ఫైనల్ రౌండ్(ఫ్రంట్ 9) సింగిల్స్‌లో టూటోరూట్ గోల్ఫర్ రేయ్ నూర్ఫోహ 1-0తో ప్రతీమ్‌కుమార్(బంకర్ బస్టర్స్)పై గెలువగా, గౌతమ్(టూటోరూట్)0-1 రాజు(బస్టర్స్) చేతిలో ఓడాడు. డబుల్స్‌లో ఇరు జట్ల మధ్య స్కోరు 1-1తో సమమైంది. రౌండ్-2(బ్యాక్ 9)తో పాటు ప్లేఆఫ్స్‌లో పోరు సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు సడెన్‌డెత్ తప్పని సరైంది. ఇందులో బంకర్ బస్టర్స్ చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. టీ గోల్ఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్ఆర్ఎన్ రెడ్డి విజేతకు ట్రోఫీ అందజేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.